



పత్తి పంటలో వేసేందుకు రసాయన ఎరువులు కలుపుకుంటున్న రైతు

ఎరువులు కుమ్మరిస్తున్నారు

- అధిక రసాయనాల వినియోగంతో అనర్థం
- జిల్లా నేలల్లో పేరుకుపోయిన భాస్వరం, పొటాషియం
- భూముల్లో దెబ్బతింటున్న పోషకాల సమతుల్యత
- పర్యావరణానికి పెను ప్రమాదమని హెచ్చరిస్తున్న శాస్త్రవేత్తలు

నెన్నెల, సెప్టెంబరు 23: రైతులు రసాయన ఎరువులను పంటల్లో కుమ్మరిస్తున్నారు. అవసరానికి మించి ఎరువులను వాడుతున్నారు. అధిక వినియోగంతో జిల్లా నేలల్లో భాస్వరం, పొటాష్ నిల్వలు పేరుక పోయాయి. విచ్చలవిడిగా ఎరువులను వాడడంతో కొన్ని నేలల్లో పోషకాలు ఎక్కువగా, మిగతా చోట్ల తక్కువగా ఉన్నాయి. ఫలితంగా పోషకాల సమతుల్యత దెబ్బతిని దిగుబడులు పెరగడం లేదు. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం... తగ్గిన సహజ ఎరువుల వినియోగం.. పంట మార్పిడి లేక పోవడం వెరసి జిల్లా భూములు సహజత్వాన్ని కోల్పోతున్నాయి.

విచ్చల విడిగా రసాయన ఎరువుల వాడకం

జిల్లాలో రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. ఒక పంట సీజన్‌లో 1,18,947 మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులు వాడుతున్నారు. యూరియా 41,661 మెట్రిక్ టన్నులు, డీఏపీ 21,901 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 38,504ల మెట్రిక్ టన్నులు, పొటాష్ 9,623 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 5,476 మెట్రిక్ టన్నులు, జింక్ సల్ఫేట్ 1,832 మెట్రిక్ టన్నులు వాడుతున్నట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. దీనికి రెట్టింపు ఎరువులు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. పర్యావరణానికి పెను ముప్పు అని తెలిసి కూడా అధిక దిగుబడులు సాధించాలన్న ఆత్యాశతో రసాయనాలు విచ్చలవిడిగా వాడుతున్నారు.రసాయనాలు భూమిలోకి ఇంకి వాననీటితో చెరువులు, నదుల్లో కలిసి పోతున్నాయి. ఫలితంగా సాగునీరు, నేల మాత్రమే కాకుండా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

నేలలు నిస్సారం...

పంటల దిగుబడి ప్రధానంగా నేలసారం, సాగుచేసే రకం, యాజమాన్య పద్ధతులపై ఆధార పడి ఉంటుంది. నేలలో సహజ సిద్ధంగా అనేక పోషకాలు ఉంటాయి. వీటి స్థితి గతులను అంచనా వేయకుండా ఎరువులను విచ్చల విడిగా వాడటం వల్ల సాగుఖర్చు పెరగడమే కాకుండా భూమి నిస్సారంగా మారుతుంది. పశుసంపద తగ్గడంతో సేంద్రియ ఎరువులు లభించడం లేదు. దీంతో రసాయన ఎరువుల పైనే ఆధారపడుతున్నారు. మోతాదుకు మించి క్రిమిసంహారక మందులు వాడటం వల్ల భూమిలోని మిత్రపురుగులు నశించిపోతున్నాయి. ఏళ్లతరబడి ఇలాగే విచక్షణ రహితంగా రసాయనాలు వాడితే మట్టి తన భౌతిక లక్షణాలు కోల్పోయి పంటలు పండని పరిస్థితులు వస్తాయి.

పత్తితోనే ముప్పు

జిల్లాలో ప్రధాన పంటలు వరి, పత్తి కాగా 70 శాతం రైతులు పత్తినే సాగు చేస్తున్నారు. కలుపులేని పంట కోసం పత్తి రైతులు బీజీ-3 (గ్రైసిల్) విత్తనాలు వాడుతున్నారు. కలుపు నివారణకు కూలీలకు బదులు నిషేధిత గ్లైఫోసెట్ మందును పిచికారి చేస్తున్నారు. సాధారణంగా పత్తికి పురుగు మందులు మూడు సార్లు వాడితే ఎక్కువ. కాని 3 సార్లు కలుపు నివారణ మందు, మరో నాలుగైదు సార్లు క్రిమిసంహారక మందులు పిచికారి చేస్తున్నారు. దుక్కిలో మాత్రమే వేయాల్సిన డీఏపీని ఆ తర్వాత కూడా వాడుతున్నారు.

జిల్లా నేలల పరిస్థితి ఇదీ..

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు జిల్లాలో భూసార పరీక్షలు నిర్వహించారు. గ్రామాల వారీగా మట్టి నమూనాలు సేకరించి పరీక్షించారు. జిల్లా నేలల్లో ఫాస్పరస్, పొటాషియం అత్యధికంగా ఉండగా.. నత్రజని లోపం ఉన్నట్లు గుర్తించారు. వేమనపల్లి, భీమారం, మంచిర్యాల మండలాల్లో అవసరానికి మించి భాస్వరం ఉంది. ఈ మండలాల్లో ఎకరానికి 24 నుంచి 33 కేజీల పాస్పరస్ నిల్వలు ఉన్నాయి. మిగతా మండలాల్లో ఎకరానికి 10 నుంచి 23 కేజీల పాస్పరస్ నిల్వలున్నాయి. ఈ మండలాల్లో డీఏపీ పెద్దగా వినియోగించాల్సిన అవసరం లేదు. కాని రైతులు మోతాదుకు మించి డీఏపీ వాడుతున్నారు. దండెపల్లి, లక్సెట్టిపేట, నస్పూర్, జైపూర్, భీమారం, వేమనపల్లి మం డలాల్లో పొటాషియం నిల్వలు అధికంగా ఉన్నాయి. భీమినిలో 51 శాతం నత్రజని లోపం నమోదైంది. 16 శాతం నేలల్లో సల్ఫర్ లోపం ఉంది. వివిధ మండలాల్లో 8 నుంచి 23 శాతం గంధంకం లోపాన్ని గుర్తించారు.

రసాయన ఎరువులతో కీడే ఎక్కువ



డాక్టర్ శివకృష్ణ వ్యవసాయ శాస్త్రవేత్త, కోఆర్డినేటర్, కృషి విజ్ఞాణ కేంద్రం బెల్లంపల్లి

మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడటంతో అధిక నిల్వలు భూమిలో పేరుకుపోతున్నాయి. పదేపదే రసాయన ఎరువులపైన ఆధార పడితే భూ భౌతికస్థితి దెబ్బతిని మేలు కంటే కీడే ఎక్కువ జరుగుతుంది. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలి. భూమిలో ఉన్న భాస్వరం పంటకు అందాలంటే జీవన ఎరువులు (పీఎస్ బీ) వాడాలి. వ్యవసాయ శాఖ సమన్వయంతో గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి రసాయన ఎరువుల అధిక వాడకంతో జరిగే అనర్థాలపై రైతుల్లో అవగాహన పెంపొందిస్తున్నాం.



జిల్లాలో పొటాషియం నిల్వలు తెలిపే చిత్రం, ఎరువులు చల్లుకుంటున్న రైతు

నేటి నుంచి పలు రైళ్ల రద్దు

గర్మిళ్ల, సెప్టెంబరు 23: కాజీపేట, బల్లార్ష మధ్య రైల్వే ట్రాక్ పనుల నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి బల్లార్షా వరకు నడిచే పలు రైళ్లను మంగళవారం నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు రైల్వే అధికారులు రద్దు చేశారు. కొన్నింటిని దారి మళ్లించారు. రైళ్ల రద్దు కావడంతో దసరా పండగ నేపథ్యంలో మంచిర్యాల, కుమరంభీంఆసిఫాబాద్ జిల్లాల ప్రజలు ప్రయాణ కష్టాలు ఎదురు కానున్నాయి. ఆర్టీసీ బస్సులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వేమనపల్లి, సెప్టెంబరు 23: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు పలు కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకుని కేసులను పరిష్కరించుకోవాలని నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి 28వ తేదీ వరకు బెల్లంపల్లి కోర్టులో జరిగే లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పవర్ ప్లాంట్‌ను ప్రారంభించాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 23: జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలలోని శాలివాహన పవర్ ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించాలని పవర్ ప్లాంటు కార్మిక సంఘం నాయకులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. 20 నెలలుగా పీపీఏ ముగిసిందని ప్లాంట్‌ను మూసివేశారని తెలిపారు. వెంటనే ప్లాంటు తెరిచేలా కృషి చేయాలని కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ కలెక్టర్‌కు విన్నవించారు. సత్యనారాయణ, తిరుపతి, రవిశంకర్, శ్రీశైలం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 23: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని జిల్లా గ్రామీణాభివృద్ధి ఉప కార్యాలయంలో గ్రామీణాభివృద్ధి సంస్థ, మేజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తామని డీఆర్‌డీవో కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. హైద్రాబాద్‌లోని ప్రముఖ కంపెనీల ఏజెన్సీలు, సంస్థల ద్వారా ప్రతీ అభ్యర్థికి ఉద్యోగం కల్పిస్తామన్నారు. బయోడేటా, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 23: గురిజాల పంచాయతీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ సభ్యుడు బొమ్మగోని అనిల్ గౌడ్ ఇటీవల మృతి చెందగా అతని తండ్రి తిరుపతికి రూ.2 లక్షల బీమా చెక్కును మాజీ సర్పంచు రంజిత వెంకటేష్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్‌లు సోమవారం అందజేశారు. సురేందర్‌గౌడ్, సత్యనారాయణ, రవి, రాజేష్, పాల్గొన్నారు.

చెన్నూరు, దండేపల్లిలో
చెరువుల సర్వే

- మూడు రోజుల్లో పూర్తి
- అనంతరం కలెక్టర్‌కు నివేదిక
- భీమారంలో పలువురికి నోటీసులు



అస్నాద్ రోడ్డు వద్ద హద్దులు నిర్ణయిస్తున్న అధికారులు

చెన్నూరు, సెప్టెంబరు 23: చెన్నూరు పట్టణం అస్నాద్ రోడ్డు ప్రాంతంలో ఉన్న కుమ్మరికుంట చెరువు సర్వేను సోమవారం రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు సంయుక్తగా సర్వే ప్రారంభించారు. సర్వే ప్రారంభంతో కుమ్మరికుంట బఫర్‌జోన్‌లో నిర్మించుకున్న ఇంటి నిర్మాణదారులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం కుమ్మరికుంట చెరువు 16.24 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉండేది. చెన్నూరు పట్టణం రోజు రోజుకు అభివృద్ధి చెందుతుండడంతో కొన్నేళ్ళ నుంచి చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ప్రధాన రహదారిని ఆనుకుని భవనాలు నిర్మించడంతో శిఖం భూమి 5, 6 ఎకరాలకే పరిమితమైంది.

కలెక్టర్ ఆదేశాల మేరకు కుమ్మరికుంట శిఖం భూమిని 16.24 ఎకరాలను గుర్తించేందుకు అధికారులు సర్వేకు శ్రీకారం చుట్టారు. కుమ్మరికుంట శిఖం హద్దులను గుర్తించేందుకు ఈ నెల 20న పలువురు ఇంటి యాజమానులకు నోటీసులు జారీ చేశారు. సర్వే సమయంలో యజమానులు డాక్యుమెంట్లతో హాజరు కావాలని కోరారు. సర్వే నెంబరు 971లో 16.24 ఎకరాల శిఖం భూమిని గుర్తించేందుకు సర్వేలు ప్రారంభించినట్లు ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్ పేర్కొన్నారు. 16.24 ఎకరాల శిఖం భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తికావడానికి మూడు రోజులు పడుతుందన్నారు. అనంతరం నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు. సర్వేయర్ అశోక్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ తిరుపతి, డిప్యూటీ తహసీల్దార్ సనత్‌కుమార్,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంజిత్, ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుమ్మరికుంట చెరువు భూమిపై సంయుక్త సర్వే : కలెక్టర్

చెన్నూరు: కుమ్మరికుంట చెరువు భూమిపై సంబంధిత శాఖల అధికారులు సంయుక్త సర్వే నిర్వహిస్తారని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. నీటి పారుదల, రెవెన్యూ శాఖల సమన్వయంతో సర్వే జరుగుతుందని తెలిపారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిని విచారించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకొంటామని తెలిపారు.

ఆల్లీపూర్ ఊర చెరువు విస్తీర్ణంపై సర్వే

దండేపల్లి: దండేపల్లి మండలం అల్లీపూర్ గ్రామ సమీపంలో ఊర చెరువు గతంలో కబ్జాకు గురి కావడంపై గ్రామస్థులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆల్లీపూర్ ఊర చెరువు విస్తీర్ణంపై సోమవారం జిల్లా సర్వేయర్ శ్రీనివాస్, తహసీల్దార్ సంధ్యరాణి సిబ్బందితో సర్వే నిర్వహించారు. ఆల్లీపూర్‌లో 100 సర్వే నెంబర్‌లో సుమారు 59.33 ఎకరాల చెరువు విస్తీర్ణం ఉంటుందన్నారు. గతంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు ఊర చెరువు భూమి ఆక్రమణకు గురవుతుం దని రైతులు ఫిర్యాదు చేశారు. జిల్లా సర్వేయర్, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఊర చెరువుతోపాటు పక్కన ఉన్న పట్టాదారుల హద్దులు సర్వే చేశారు. పూర్తి సర్వేకు మూడు రోజులు అవుతుందని, అనంతరం కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. ఎస్సై ఉదయ్‌కిరణ్, ఏఎస్సైలు పున్నంచందు,రాజేందర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పలువురికి నోటీసులు అందజేత

భీమారం: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల ఊర చెరువు బఫర్ జోన్ ఎఫ్‌టీఎల్‌లో ఇండ్లు నిర్మించుకున్న యజమానులకు తహసీ ల్దార్ సదానందం ఆధ్వర్యంలో నోటీసులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత వారంలో ఊర చెరువు సర్వే పనులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమన్వయం తో పూర్తి చేసి హద్దులను ఏర్పాటు చేశామని తెలిపారు. చెరువు హద్దులో నిర్మాణాలు చేసుకున్న వారికి సోమవారం నోటీసులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.



దండేపల్లి మండలం అల్లీపూర్‌లో చెరువు కబ్జాపై సర్వే చేస్తున్న అధికారులు



భీమారంలో నోటీసులు అందజేస్తున్న ఆర్ఐ స్రవంతి

ధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

చెన్నూరు, సెప్టెంబరు 23: గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారానికి ఈనెల 28న నిర్వహించే ఛలో హైద్రాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు కోరారు. సోమవారం గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ 010 పద్దు కింద 1వ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. అశాస్త్రీయమైన కాల నిర్ణయ పట్టికను సవరించాలన్నారు. వార్డెన్‌లను, కేర్ టేకర్‌లను నియమించాలని, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. అన్ని గురుకులాలను కామన్ డైరెక్ట్ పరిధిలోకి తీసుకురావాలని, పార్ట్‌టైం, కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి సమస్యను పరిష్కరించాలి



రైల్వే అధికారికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూర్, సెప్టెంబరు 23: మండలంలోని రెండు రైల్వే అండర్‌బ్రిడ్జిల్లో వరద నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సోమవారం రైల్వే అధికారులకు వినతిపత్రం అందించారు. పలు గ్రామాల ప్రజలు మండలానికి రావాలంటే అండర్ బ్రిడ్జిలు దాటాల్సి ఉంటుందని, వర్షం పడితే మోకాలు లోతు వరకు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. అత్యవసర సమయంలో అండర్ బ్రిడ్జిల్లో నీరు నిలిచి ఉండడంతో అంబులెన్స్‌లు రాలేని పరిస్థితి ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీటీసీ శంకర్, నాయకులు మాసాడి తిరుపతి, జుబేర్, గౌస్, జావుద్‌హుస్సేన్, ఆదంఖాన్, సురేష్, శంకర్ పాల్గొన్నారు.

దీపావళి బోనస్‌పై 29న సమావేశం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23: పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు (పీఎల్ఆర్) (దీపావళి) బోనస్‌పై ఈ నెల 29న సమావేశం నిర్వహించనున్నట్లు కోల్ ఇండియా చైర్మన్ నుంచి తమ యూనియన్‌కు సమాచారం అందిందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలోని సీఐఎల్ ప్రధాన కార్యాలయంలో జేబీసీసీఐ మూడవ స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. గతేడాది దీపావళి బోనస్ రూ.85వేల 500 కాగా, ఈసారి మరింత మెరుగైన బోనస్‌ను సాధిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరిస్తాం



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 23: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పెర్కపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్, నెన్నెల, జన్నారం, కన్నెపల్లి, మంచిర్యాల, కాసిపేట మండలాల నుంచి ప్రజలు దరఖాస్తులు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 35 దరఖాస్తులు వచ్చాయని వీటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



చీరలను పంపిణీ చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

నస్పూర్, సెప్టెంబరు 23: నస్పూర్ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీర్చడమే లక్ష్యంగా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కృషి చేస్తున్నారని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆడపడుచులకు బతుకమ్మ పండగ కానుకగా 8, 10, 11, 12, 13, 19, 20, 23 వార్డుల మహిళలకు సోమవారం సీసీసీ కార్నర్ వద్ద చీరలను పంపిణీ చేశారు. సురేఖ మాట్లాడుతూ భవిష్యత్‌లో నీటి ఎద్దడి తలెత్తకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ళ వేణు, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఇన్‌చార్జీ రమేష్, పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, కౌన్సిలర్లు సంధ్యారాణి, తోట శ్రీనివాస్, పూదరి కుమార్, సీపతి సుమతిమల్లేష్, మహిళ కాంగ్రెస్ నాయకురాలు యశోధ, ఆశాలత పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 23: మందమర్రి మండలంలోని శ్రీపతినగర్‌కు చెందిన రుద్రారపు లక్ష్మిని సఖి కేంద్రం ద్వారా శ్రీసాయి దృష్టి వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించామని జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీకి ముగ్గురు కూతుళ్లు ఉన్నారని, భర్త మరణించాడని, పిల్లలు పోషణ చూడకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వృద్ధాశ్రమంలో చేర్పించినట్లు తెలిపారు.

అక్రమార్కులను వదిలేది లేదు

విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 23 : అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. సోమవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. నస్పూర్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో టీబీజీకెఎస్ నాయకుడు డీకొండ అన్నయ్య భవనం అక్రమ నిర్మాణం అయినందునే అధికారులు కూల్చివేశారన్నారు. ఆ భవనం ప్రభుత్వ భూమిలో ఉందని అప్పటి తహసీల్దార్ నోటీసులు జారీ చేశారన్నారు. ఆ భవనం తొలగింపుపై మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు విశ్వసించరని అన్నారు. బీఆర్ఎస్ నేతల అక్రమాలకు దివాకర్‌రావు కొమ్ముకాశారని ఆయన ఆరోపించారు.

మున్సిపాలిటీలో ఉద్యో గాలు పెట్టిస్తానని కౌన్సిలర్ హరికృష్ణ డబ్బులు తీసుకొని మోసగించాడని, బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు అతనిపై చర్యలు తీసుకున్నారన్నారు. బేర సత్యనారాయణపై అనేక ఫిర్యాదులుండగా బాధితుల పక్షాన నిలవకపోగా దివా కర్‌రావు రోడ్డుపై ఆందోళన చేయడం శోచనీయమన్నారు. లక్షెట్టిపేటలో ముత్తె సత్తయ్య దండేపల్లిలో హరినాయక్ అనే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సౌకర్యం కోసం కొంత కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పడం లేదన్నారు. గంజాయి అమ్మకం, సేవించడాన్ని తీవ్రంగా పరిగణిస్తామన్నారు. గంజాయి రాకెట్ వెనుక ఎవరు ఉన్నారో బయ టపెడుతామని, ఎవరు పట్టుబడినా చట్టపరమైన చర్యలుం టాయన్నారు.

రాత్రి 10 గంటలకే దుకాణాలు మూసివేసేలా చర్యలు చేపడుతామన్నారు. రాత్రివేళల్లో యువకులు బయట తిరగవద్దని సూచించారు. ఐబీ ప్రాంతంలో మాతా శిశు ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని, త్వరలోనే నిర్మాణ పను లను చేపడుతామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్, రామగిరి భానేష్, కొండ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ఎమ్మెల్యేను కలిసిన హౌసింగ్ సొసైటీ సభ్యులు

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు జన్మదినం సందర్భంగా ఆయన నివాసంలో హౌసింగ్ సొసైటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి హబీబ్ హుస్సేన్, ఉపాధ్యక్షులు సైన్ల మొండయ్య, సభ్యులు శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే ఉన్నారు.



విలేకరిని అరెస్టు చేసిన పోలీసులు

చెన్నూరు, సెప్టెంబరు 23: చెన్నూరు పట్టణంలో ఓ దినపత్రికకు విలేకరిగా పనిచేస్తున్న కనుకుంట్ల వెంకట్రాజ్‌ను అరెస్టు చేసినట్లు సీఐ రవీందర్ పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన వెంకట్రాజ్ విలేకరి ముసుగులో అమాయక ప్రజలను, వ్యాపారస్తులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసేవాడని తెలిపారు. ఎన్‌జీవో కాలనీకి చెందిన గంగిరెడ్డి రాజేశం ఒక పోర్షన్‌ను సుందర్ అనే అతనికి అద్దెకు ఇచ్చాడు. సుందర్ రెండుసంవత్సరాల నుంచి అద్దెచెల్లించకపోవడంతో రాజేశం నిలదీశాడు. వెంకట్రాజ్ ఇంటి యజమాని రాజేశంకు ఫోన్‌చేసి సుందర్‌ను కులం పేరుతో దూషించావని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపెడతానని బెదిరిస్తూ రూ.50వేలు డిమాండ్ చేశాడన్నారు. రాజేశం రూ.5వేలు చెల్లించాడన్నారు. మిగితా డబ్బులకోసం రాజేశంను వేధించడంతో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడన్నారు. గతంలోవెంకట్రాజ్ బొమ్మశ్రీనివాస్‌రెడ్డి వద్ద రూ.25,500 వసూలుచేశాడని, నాయిని తిరుపతి రూ.50వేలు డిమాండ్‌చేశాడని తెలిపారు. గుర్రం సుధాకర్ అనే చికెన్‌వ్యాపారిని అక్రమ నిర్మాణ చేపడుతున్నావని రూ.5 వేలు వసూలుచేయగా అతని ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు. నిందితుడు వెంకట్రాజ్ వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. నిందితున్ని సోమవారం కోర్టులో హాజరుపర్చినట్లు సీఐపేర్కొన్నారు. సమావేశంలోఎస్‌ఐసుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

తాండూర్, సెప్టెంబరు 23: మండలంలోని ఎఫ్‌ఎల్‌ఎన్‌పై తెలుగు బోధించే ఉపాధ్యాయులకు రూమ్‌టూరీడ్ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి పాఠశాలలో సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు తెలుగుకు సంబంధించి చదవడం, రాయడం వచ్చేలా చూడాలని, పాఠశాలల్లో లైబ్రరీ పీరియడ్‌ను నిర్వహించాలని సూచించారు. నోడల్ అధికారి మల్లేశం, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్‌పై అవగాహన

నస్పూర్, సెప్టెంబరు 23: నస్పూర్ పీహెచ్‌సీలో సోమవారం సమగ్ర ఆరోగ్యప్రచారంలో భాగంగా మంచిర్యాలదిశ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 25 మందికి రక్త పరీక్షలు చేశారు. వైద్యాధికారి సమత, డీఎస్‌ఆర్‌సీ కౌన్సిలర్ నరేందర్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, సీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 23: కొత్తూరులో విద్యుత్‌అధికారులు సోమవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఏఈ గణేష్ సిబ్బందితో పొలాలకు వెళ్లి వంగిన విద్యుత్‌స్తంభాలను, లూజ్‌లైన్‌లను గుర్తించారు. 6 వంగినస్తంభాలను, లూస్‌లైన్‌లను సరిచేశారు. ఏమైనా విద్యుత్‌సమస్య ఉంటే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫోర్‌మెన్ నర్సింగరావు, ఎల్‌ఐ గౌస్, ఎస్‌ఎల్‌ఐ శంకర్,లైన్‌మెన్‌లు వెంకట్‌రెడ్డి,చంద్రమౌళి,సతీష్ పాల్గొన్నారు.

కార్మికులను దగా చేసిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ

మంచిర్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణికి చెందిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ యూనియన్లు లాభాల వాటా విషయంలో కార్మికులను దగా చేశాయని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్ బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఒక ప్రకటనలో ఆరోపించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ రూ.4701 లాభాలు సాధించిందన్నారు. వీటిలో రూ.2289 కోట్లను పక్కన బెట్టి రూ.2412 కోట్లు మాత్రమే లాభాలుగా చూపించి అందులో నుంచి 33 శాతం రూ.796 కోట్లను కార్మికుల వాటాగా ప్రకటించారన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కుట్రలను ఖండించి కార్మికులకు న్యాయం చేయాల్సిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ యూనియన్లు యాజమాన్యానికి తొత్తులుగా వ్యవహరించినట్లు ఆరోపించారు. తాము మెరుగైన లాభాల వాటాను సాధించామని గొప్పలు చెప్పుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థలో అన్ని విభాగాల్లో కీలకంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కేవలం రూ.5 వేలు ప్రకటించారని, ఇది న్యాయ సమ్మతం కాదన్నారు. వారికి కనీసం 20 శాతం లాభాల వాటా ఇవ్వాల్సి ఉందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌లు యాజమాన్యానికి వంత పాడుతూ కార్మికవర్గ ద్రోహులుగా మారారని దుయ్యబట్టారు.

లాభాల నుంచి పక్కన బెట్టిన రూ.2289 కోట్ల నుంచి కార్మికుల ఆరోగ్యం, వారి పిల్లల చదువులు, కార్మికులకు సొంతింటి పథకం అమలు, ఆదాయపు పన్ను చెల్లించేలా యాజమాన్యంతో మాట్లాడి ఒప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ ఆగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ మాదిరిగా కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీకి సైతం కార్మికవర్గం గుణపాఠం చెబుతుందన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు.

చెరువులను కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదులు

తాండూర్, సెప్టెంబరు 23: మండలంలోని రేచిని గ్రామపంచాయతీ పరిధిలోని కొత్త చెరువు కబ్జాకు గురైందని గ్రామానికి చెందిన బామనపల్లి ఆనంద్ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. కొత్త చెరువు 446 సర్వే నెంబరులో 22.93 ఎకరాల చెరువు భూమి ఉంది. ఈ చెరువు కింద ఆయకట్టు 56 ఎకరాలు సాగవుతుందని, చెరువులో నీరు నిల్వ ఉండడం వల్ల మత్స్య సంపదకు, వ్యవసాయ భూములకు ఎలాంటి ఆటంకం లేకుండా నీరు అందుతుందన్నారు. కొత్త చెరువు కబ్జా కావడం వల్ల నష్టం వాటిల్లుతుందని, ఎఫ్‌టీఎల్ ల్యాండ్‌లో అనుమతులు లేకుండా అక్రమంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జన్నారం: మండలంలో అక్రమణకు గురవుతున్న చెరువులను కాపాడాలని ఎంపీడీవో శశికళకు చెరువుల పరిరక్షణ కమిటీ నాయకులు వినతి పత్రం అందించారు. మండలంలో చెరువు భూములను కొందరు ఆక్రమార్కులు ఆక్రమించారని తెలిపారు. చెరువులను పూర్తిస్థాయిలో సర్వేచేసి హద్దులను నిర్ధయించాలని తెలిపారు. నాయకులు కమ్మల విజయ్‌ధర్మ, శ్రీరాముల భూమాచారి, తిరుపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: దస్నాపూర్ శివారులోని సర్వే నెంబరు 40లో ఉన్న పెద్ద చెరువు ఆక్రమణకు గురైందని దస్నాపూర్ గ్రామస్థులు తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందించారు. చెరువు విస్తీర్ణం 30 ఎకరాలు కాగా దాదాపు 15 ఎకరాల వరకు ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. దీనిపై సర్వేచేసి చెరువు భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరారు.

కాసిపేట: ప్రధాన రహదారి వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కొండాపూర్ యాప నుంచి సోనాపూర్ వరకు రహదారి వెంట పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి రహదారిని ఆక్రమించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని తెలిపారు. చిన్న ధర్మారం బ్రిడ్జిపై సైడ్ వాల్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, సైడ్ వాల్ నిర్మించాలని కోరారు. చిన్న ధర్మారంలో ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

కన్నెపల్లి: రుణమాఫీ చేయాలని లింగాల గ్రామానికి చెందిన పలువురు రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం రూ.2 లక్షలు రుణ మాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు కాలేదని వెంటనే రుణ మాఫీ చేయాలని కోరారు. రైతులు సత్తయ్య, మొండి, హన్మంతు, అంకులు, మల్లయ్య తదిరతులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందికి నాలుగు నెలలగా వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వెంటనే వేతనాలు చెల్లించాలని ఎంపీడీవోకు పంచాయతీ సిబ్బంది వినతి పత్రం అందించారు. దసరా పండగ ఉన్నందున వెంటనే వేతనాలు వచ్చేలా చూడాలని కోరారు.

కరపత్రాల విడుదల

బెల్లంపల్లి, సెప్టెంబరు 23: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా చేపట్టిన తెలంగాణ సచివాలయం ముట్టడి కరపత్రాలను సోమవారం కాంటా చౌరస్తాలో దళిత బహుజన పార్టీ, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక సమితి నాయకులు విడుదల చేశారు. జిల్లా ఇన్‌చార్జీ లింగాల జలపతి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్ అమలుకు ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీని రద్దు చేయాలని ఈ నెల 30న సచివాలయం ముట్టడి చేపడుతున్నామన్నారు. దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కరుణాకర్, ఈశ్వర్, రాంచందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.





స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

తాండూర్, సెప్టెంబరు 23: తాండూర్ గ్రామంలో అధికారులు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. తడి పొడి చెత్తలను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించాలని ఎంపీడీవో సూచించారు. నాయకులు ఎండీ ఈసా, ఉమారాణి, రాంచందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు. బోయపల్లిలో ఎంపీవో అనిల్‌కుమార్‌ఆధ్వర్యంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. రేచిని, బారేపల్లి, అన్నారం గ్రామాల్లో ఎంపీడీవో అనిల్‌కుమార్ పర్యటించారు. ఇండ్లలోని డబ్బాలు, కూలర్లలో ఉన్ననీటిని పారబోయించారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా ఫాగింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

విద్యార్థుల ఆర్థిక సహాయం

గర్మిళ్ల, సెప్టెంబరు 23: హైద్రాబాద్‌లోని ఐటీఆర్‌ఆర్‌వోడీడీడీ అంధుల స్వచ్ఛందసంస్థకు మంచిర్యాలలోని రివిలేషన్‌పాఠశాల విద్యార్థులు ఆర్థిక సహాయం అందించారు. విద్యార్థులు జమచేసిన డబ్బులతోపాటు ఉపాధ్యాయులు ఒకరోజు వేతనం రూ.81వేల చెక్కును సంస్థ నిర్వాహకులకు సోమవారం పాఠశాలలో కరస్పాండెంట్ రాపోలువిష్ణువర్ధన్‌రావు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయని తెలిపారు.

మహిళ శక్తి క్యాంటీన్ కోసం ఏర్పాట్లు

మందమర్రిరూరల్, సెప్టెంబరు 23: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మహిళ శక్తి క్యాంటీన్ నిర్మాణం కోసం స్థలాన్ని సోమవారం చదును చేశారు. ప్రభుత్వం కేటాయించిన క్యాంటీన్ నిర్మాణంపూర్తిగా మండలసమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. ఇందుకోసం చెట్లను తొలగించారు. త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు.

కేటీఆర్‌ను కలిసి రాజారమేష్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 23: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,ఎమ్మెల్యే కేటీఆర్‌ను సోమవారం చెన్నూరు నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ఇన్‌చార్జీ డాక్టర్ రాజారమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీజిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్ కేటీఆర్‌కు రాజరమేష్‌ను పరిచయం చేశారు. చెన్నూరులో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లు తెలిపారు.

పంటలపై రైతులకు అవగాహన

కాసిపేట, సెప్టెంబరు 23: కోమటిచేను, కొండాపూర్, పల్లంగూడ, కోనూరు గ్రామాల్లోని పత్తిపంటలను సోమవారం ఏవో ప్రభాకర్ పరిశీలించారు. రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పత్తి కాయ దశలో ఉందని, రసం పీల్చే పురుగు, పచ్చ దోమ, తెల్లదోమ, ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉందని, దీంతో పత్తిపంటకు నష్టం జరుగుతుందని తెలిపారు. పంటలో ఏమైనాసందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.





అద్దె బస్సుల డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



డీఎంకు వినతి పత్రం అందజేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 23: ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అద్దె బస్సుడ్రైవర్ల సంఘం నాయకులు సోమవారం డీఎం విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు సమాచారం ఇవ్వకుండా డ్రైవర్లను తొలగించకూడదని, వేరే ప్రాంతాలకు చెందిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవద్దని, కేఎంపీఎల్ పేరుతో డ్రైవర్‌ను వేధించకూడదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మదుసూదన్, షఫీ, దివాకర్, అశోక్, భాస్కర్, నాగేష్, రంజాన్, అఖిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టుకార్మికులు

రెబ్బెన, సెప్టెంబరు 23: సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి సింగరేణి కాంట్రాక్టుకార్మికులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ సభ్యుడు ప్రకాష్ మాట్లాడుతూ సింగరేణి అధికారులకు, కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ప్రకటించటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లాస్, దుర్గం రవీందర్, సాయి, కాంట్రాక్టుకార్మికులు రాజేష్, శ్రీనివాస్, సంతోష్, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీకి ఎంపిక



ప్రేందీప్

రెబ్బెన, సెప్టెంబరు 23: ఈనెల25 నుంచి హర్యానాలోని రోహతక్ జిల్లాలో 43వ సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌పోటీలకు గోలేటి సింగరేణి ఉన్నతపాఠశాల విద్యార్థి ప్రేందీప్ ఎన్నికైనట్టు ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. ఎంపికైన ప్రేం దీప్‌ను రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎస్ తిరుపతి, బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్, సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, తదితరులు అభినందించారు.

గుర్తింపుకార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 23: జిల్లాలోని అర్హులైన ట్రాన్స్‌జెండర్లు గుర్తింపుకార్డు, ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖాధికారి భాస్కర్ ఒక ప్రకట నలో తెలిపారు. అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు జీవనోపాధి కింద వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు, సేవావ్యాపారాలు స్థాపించుకొని స్థిరమైన ఆదాయాన్ని పొంది సాధారణ జీవ నాన్ని గడపాలన్న ఉద్దేశ్యంతో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమశాఖ ద్వారా పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తామన్నారు. మిగితా వివరాలకు జిల్లా సంక్షేమ శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ రవికుమార్‌ను సంప్రదించా లన్నారు.

ఐకేపీ సిబ్బంది మృతికి సంతాపం

వాంకిడి, సెప్టెంబరు 23: కెరమెరిఐకేపీ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది దుర్గం శంకర్ మృతిపట్ల సోమవారం వాంకిడిలో సిబ్బంది సంతాపం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది విఠల్, వేణుగోపాల్, భీంరావు, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలను నివారించాలని మహిళల రాస్తారోకో

రెబ్బెన, సెప్టెంబరు 23: రెబ్బెన గోలేటిలో పందులు, కుక్కలను వెంటనే నివారించాలని సోమవారం రాత్రి సింగరేణి రోడ్డుపై మహిళలు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ రెబ్బెన, గోలేటి, ఇతర గ్రామాల్లో కుక్కలు తరుచూ ద్విచక్రవాహనదారులపై, చిన్నారులపై దాడిచేసి గాయపరుస్తున్నాయని అన్నారు. సింగరేణి అధికారులు వెంటనేవాటిని పట్టుకుని నివాసప్రాంతాలకు దూరంగా పంపించాలని కోరారు. మహిళలు రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకొని ఎస్‌వోటు జీఎం రాజమల్లు అక్కడికి చేరుకొని త్వరలోనే ఈసమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో మహిళలు రాస్తారోకోను విరమించారు.



గోలేటిలో రాస్తారోకో చేస్తున్న మహిళలు

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రమేష్ (ఫైల్)

కాసిపేట, సెప్టెంబరు 23: మండలంలోని ధర్మారావుపేటకు చెందిన యువ జన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు జంగిలి రమేష్ (33) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల 16న గణేష్ నిమజ్జనం శోభాయాత్రలో పాల్గొన్నాడు. రాత్రి ఇంటికి వచ్చి అపాస్మరక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు మంచిర్యాలలోని ఆసుపత్రికి, అనంతరం హైద్రాబాద్ తరలించగా చికిత్స పొం దుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కుటుం బీకులు గుర్తు తెలియని విష పురుగు కాటు వేయడం వల్ల మృతి చెంది ఉం టాడని దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంజనేయులు తెలిపారు. రమేష్ మృతికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించి సంతాపం ప్రకటించారు.

ఇసుక డంప్‌ల సీజ్

జైపూర్, సెప్టెంబరు 23: ఇందారంలోని పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నిల్వ చేసిన ఇసుక కుప్పలను సోమవారం సీజ్ చేశామని తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. ఖాసీంపల్లె, ఇందారం యూసుఫ్ బ్రిక్స్ వద్ద, ఫంక్షన్ హాల్, తాటిచెట్ల సమీపంలో నిల్వ ఉన్న 103 ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక నిల్వ, రవా ణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ తిరుపతి పాల్గొన్నారు.

గంజాయి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి సహకరించాలి



సోమగూడెంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కాసిపేట, సెప్టెంబరు 23: గంజాయి, మత్తు పదార్థాల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం సోమగూడెం, చొప్పరిపల్లి, కాసిపేట, కోమటిచేను గ్రామాల్లో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన వారి ఇండ్లలో సోదాలు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాల నిల్వ, రవాణా చేసినట్లు ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాల న్నారు. ఎవరైనా అనుమానా స్పదంగా కనిపిస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు.

కలప పట్టివేత

జన్నారం, సెప్టెంబరు 23 : మండల కేంద్రంలోని శ్రీలంక కాలనీకి చెందిన తీగల నరేష్ అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలప దుంగలను సోమవారం పట్టుకున్నట్లు డిప్యూటీ డీఆర్‌వో తిరుపతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పక్కా సమాచారం మేరకు దాడి చేసి కలపను పట్టుకున్నట్లు తెలిపారు. కలప విలువ రూ.14 వేలు ఉంటుందని తెలిపారు. బీట్ అధికారులు శ్రీనివాస్, లాలుబాయి పాల్గొన్నారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య



లహరి (ఫైల్)

జైపూర్, సెప్టెంబరు 23: మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన ఇండ్ల లహరి (21) అనే వివాహిత వర కట్న వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడింది. ఇందారం గ్రామానికి చెందిన రమేష్‌తో సీసీసీకి చెందిన లహరికి డిసెంబరు 2021లో వివాహం జరిగింది. లహరి భర్త రమేష్‌తోపాటు అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం రూ.2 లక్షలు తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. వారి బాధలు భరించలేక లహరి సోమవారం అత్తగారింట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలుకు 18 నెలల పాప ఉన్నట్లు పేర్కొన్నారు. భర్త రమేష్, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మున్నూరు కాపు సంఘం నిర్మల్ జిల్లా బాధ్యుడిగా లక్ష్మణ్

జన్నారం, సెప్టెంబరు 23: మండలంలోని బాదంపల్లి గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న కాశెట్టి లక్ష్మణ్ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జీగా నియమితులయ్యారు. ఆపెక్స్ కౌన్సిల్ పురుషోత్తం రావు సోమవారం నియామక పత్రాన్ని లక్ష్మణ్‌కు అందజేశారు.

స్వచ్ఛమైన నీరందించేందుకు చర్యలు



జైపూర్, కాసిపేటలో మాట్లాడుతున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 23: గ్రామాల్లో స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకొంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేష్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాల యంలో బెల్లంపల్లి, తాండూర్ మండలాల గ్రామ మం చినీటి సహాయకులకు శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో మంచినీటి పైపులైన్‌ల నిర్వహణ, వాటర్ నీటి నాణ్యత పరీక్షలు, క్లోరినేషన్ ప్రక్రియపై నాలుగు రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యదర్శితోపాటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. మొదటి దశలో 37 మంది నీటి సహాయకుల నియమించగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో మహేందర్, ఎపీవో శ్రీనివాస్, అధికారులు శ్రీనాథ్, పోశన్న పాల్గొన్నారు.

జైపూర్: మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నిర్వహించే మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమాన్ని రైతు వేదికలో ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ విద్యాసాగర్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్‌లు పగిలిపోవడం, వాటర్ ట్యాంకులను శుభ్రం, వాటర్ లీకేజీ లాంటి పనులు ఎలా చేపట్టాలో శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, పాల్గొన్నారు.

కాసిపేట: మిషన్ భగీరథ కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో తాగునీటి సహాయకులకు నీటి వినియోగంపై ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. డిప్యూటీ ఈఈ రతన్‌కుమార్ మంచి నీటి నాణ్యత వాటర్ ట్యాంకుల శుద్ధి, క్లోరినేషన్, ఫ్లోరైడ్‌లపై సిబ్బందికి అవగాహన కల్పించారు. మంచి నీటిని గ్రామాల్లో విడుదల చేసే విధానం, నీటి పరీక్షల గురించి వివరించారు. అధికారులు జాఫర్, అచ్యుత్, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



నెన్నెల, జన్నారంలో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నెన్నెల, సెప్టెంబరు 23 : నెన్నెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి సయ్యద్ అబ్దుల్ రహెమాన్ రాష్ట్రస్థాయి అండర్-14 బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ప్రకాష్‌రావు, పీడీ రాజేష్‌బాబు తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు మంచిర్యాలలో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో రహెమాన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. రంగారెడ్డి జిల్లాలో అక్టోబరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. రహెమాన్‌ను పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. స్టేట్ మీట్‌లో రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

జన్నారం: మంచిర్యాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17 విభాగంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో స్లేట్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో రాధేశ్యామ్, 14 బాలికల విభాగంలో శ్రీకృతి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. డైరెక్టర్ ఏనుగు రజితరెడ్డి, ప్రిన్సిపాల్ శిరిన్‌ఖాన్, పీఈటీలు సతోష్, నగేష్, జోష్న తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం

భీమిని, సెప్టెంబరు 23: సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు తగిన మోతాదులో పోషకాహారం తీసుకుంటేనే తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. పిల్లలు తమ వయస్సు నకు తగినంత బరువు ఉండాలన్నారు. తక్కువ ఖర్చులో ఎక్కువ పోషకాలు ఉన్న చిరుధాన్యాలు, ఆకుకూరలను ఆహారంలో తీసుకోవాలన్నారు. తాజా కూరగాయలు, పండ్లు, గుడ్లు తీసుకుంటే శరీరానికి పోషకాలు అందుతాయన్నారు. వైద్యుడు కుమారస్వామి, ఎస్సై విజయ్ కుమార్, సీహెచ్ఓ జలపతి, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలపై అభిప్రాయం అడిగిన హైకోర్టు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 23: మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి హైకోర్టు సోమవారం ప్రభుత్వాన్ని అభిప్రాయం అడిగింది. ఎన్నికలకు సంబంధించిన రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని తెలిపింది. కొన్ని రోజులుగా మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికల సాధన కమిటీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో ప్రభుత్వాన్ని సోమవారం హైకోర్టు అభిప్రాయం అడిగినట్లు తెలిసింది.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గర్మిళ్ల, సెప్టెంబరు 23: కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలో నిర్వహించిన అంతర్ జిల్లా పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన మిమ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి అశ్విత ప్రతిభ కనబర్చింది. అక్టోబర్ 10, 11, 12 తేదీల్లో చెన్నైలో జరిగే సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థినిని వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసారాజు, డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, విజయ్‌కుమార్, శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

బాధిత కుటుంబానికి సరుకులు పంపిణీ

మందమర్రి టౌన్, సెప్టెంబరు 23: పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ మధుసూదన్‌రెడ్డి కుటుంబానికి ప్రజా సేవ వెల్ఫేర్ సొసైటీ సోమవారం సరుకులు పంపిణీ చేశారు. సభ్యులు సందీప్, దిలీప్, సంజయ్, పాషా పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడుదాం



మంచిర్యాల, బెల్లంపల్లిలో లేబర్ కోడ్ పత్రులను దహనం చేస్తున్న కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 23 : మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడుదామని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జైపాల్‌సింగ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. సోమవారం బస్టాండ్ ఆవరణలో నాలుగు లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. వారు మాట్లాడుతూ గతేడాది మోదీ ప్రభుత్వం ఎలాంటి చర్చలు లేకుండా కార్మిక చట్టాలను సవరించిందన్నారు. పెట్టుబడిదారులైన అధానీ, అంబానీ లాంటి కార్పొరేట్ వ్యక్తులకు మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తాకట్టుపెట్టే విధంగా వ్యవహరిస్తుందన్నారు. మోదీ చర్యలను నిరసిస్తూ బ్లాక్ డేను విజయవంతంగా కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కార్మిక చట్టాలను సవరించి లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బింగి సుధాకర్, జాడి చంద్రయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు అరుణ, గొల్ల అంజయ్య, సతీష్, బుట్ట గడ్డ చిన్నన్న, సురేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం పట్టణంలోని కాంటా చౌరస్తాలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు లేబర్ కోడ్ పత్రాలను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్‌లకు అనుకూలంగా, కార్మిక వర్గానికి వ్యతిరేకంగా 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సింగరేణి ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ నాయకులు మణిరాంసింగ్, చాంద్‌పాషా, గౌస్, రాజన్న, మహేందర్, శంకర్, రాంసింగ్, పోచమల్లు, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: కేంద్రం 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ బ్లాక్‌డేగా నిర్వహించామని హెచ్ఎంఎస్ మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గనిపై నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కేంద్రం కార్పొరేట్‌లకు మేలు చేసేందుకు నాలుగు కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. పార్వతి రాజిరెడ్డి, వెల్డి సుదర్శన్, ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, చొప్పరి రామస్వామి, థామస్, ప్రభాకర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో ఎస్పీ ప్రత్యేకపూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 23: జిల్లాకేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో సోమవారం ఎస్పీ డీవీ శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేకపూజలు నిర్వ హించారు. అనంతరం ఆలయకమిటీ ప్రతినిధులు ఎస్పీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అన్యాక్రాంతానికి గురవుతున్న ఆలయ స్థలంపై ఎస్పీకి వివరించగా సానుకూలంగా స్పందించిన ఎస్పీ అక్రమాలకు గురవుతున్న స్థలంపై విచారణ జరిపించాలని సీఐ సతీష్‌కుమార్‌ను ఆదేశించారు.

కుమారులు కొడుతున్నారని వృద్ధుడి ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పోచయ్య

కౌటాల, సెప్టెంబరు 23: మండలంలోని గిన్నెలేటి గ్రామానికి చెందిన మోర్లె పోచయ్య తనకుమారులు కొడుతున్నారని ఆరోపిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకుదిగాడు. పోచయ్యతెలిపిన వివరాల ప్రకారం.. తనకుముగ్గురు కుమారులు ఉన్నారని, తనకున్న 16ఎకరాల భూమిలో 12 ఎకరాలు ముగ్గురి పేరిట పట్టాచేసి ఇచ్చానని, తనపేరిట 4ఎకరాల భూమిని ఉంచుకోగా దానిని కూడా వారి పేరిట చేయించుకున్నారన్నారు. కొద్దిరోజులు బాగానే చూసుకున్న కుమారులు ఇప్పుడు అన్నం పెట్టకపోగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించాడు. తన కొడుకుల పేరున పట్టాచేసిన భూమిని తిరిగి తనపేరుకు మార్చాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశాడు. రెవెన్యూ సిబ్బంది పోచయ్యను సముదాయించి ఫిర్యాదు చేసుకుంటే పట్టారద్దు చేస్తామని తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 23: నూతనంగా తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్ గౌడ్‌ను మాజీమంత్రి ఐకేరెడ్డి, మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సమస్యలపై కాసేపు చర్చించారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే

‘పీఎం విశ్వకర్మ’ అమలుకు సమన్వయంతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 23: ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం అమలుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు శిక్షణ అనంతరం బ్యాంకు రుణాలపై అధికారులు, అమలు కమిటీ సభ్యులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కులవృత్తులు చేసుకునే వారి అభివృద్ధికోసం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ప్రారంభించిందన్నారు. టైలరింగ్, బార్బర్, భవన నిర్మాణ మేస్త్రీలుగా శిక్షణ పూర్తైన వారికి కిట్లు అందించడంతో పాటు బ్యాంకు రుణ సదుపాయం కల్పించేవిధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. శిక్షణ సమయంలో స్టయి ఫండ్ అందించేలా చూడాలని తెలిపారు. జిల్లాలో 2,196 దరఖాస్తులు రాగా మొదటి దశలో గ్రామపంచాయతీల పరిధిలో 992దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, రెండో దశలో 864దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, మూడో దశలో 447దరఖాస్తుల మంజూరుకు సిఫారసు చేశామని తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ అశోక్, ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, డీపీవో భిక్షపతి, ప్రశాంత్, కమిటీసభ్యులు శ్రీశైలం, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

28న జాతీయ లోక్‌అదాలత్

సిర్పూర్(టి), సెప్టెంబరు 23: ఈ నెల 28న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయాధికారి అజయ్‌వాలాల అన్నారు. సోమవారం మెజిస్ట్రేట్ కోర్టు భవనంలో కాగజ్‌నగర్ పోలీసులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాగజ్‌నగర్ పోలీసు డివిజన్ పరిధిలో అధిక మొత్తంలో కేసులు రాజీమార్గంలో పరిష్కరిం చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రామానుజన్, సీఐరమేష్, ఎస్సైకమలాకర్, డివిజన్ లోని ఎస్సైలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా

బెజ్జూరు, సెప్టెంబరు 23: మండలకేంద్రం సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద సోమవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కోరుట్లకు చెందిన ఇద్దరు చిరు వ్యాపారులు ఆటోలో బట్టలు అమ్మేందుకు వస్తున్న క్రమంలో ఆటో అదుపుతప్పి పంటపొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జుకాగా ఆటోలో ఉన్న ఇద్దరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

పురుగుల మందు డబ్బాతో రైతు కుటుంబం ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బా పట్టుకుని ఆందోళన చేస్తున్న పత్రు, కుటుంబ సభ్యులు

కౌటాల, సెప్టెంబరు 23: తమ భూమి విషయంలో రెవెన్యూ అధికారులు అన్యాయం చేశారంటూ ఆరోపిస్తూ ఓరైతు కుటుంబ సభ్యులతో సహా సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగులమందు డబ్బాతో ఆందోళనకు దిగాడు. వివరాల్లోకి వెళ్తే.. కౌటాల మండలం గుండాయిపేట గ్రామానికి చెందిన మండవగడే పత్రుకు గ్రామశివారులోని 167/28లో అయిదు ఎకరాల పట్టా భూమిఉంది. గత ఏడాది రెవెన్యూ అధికారులు ఈ భూమిని గ్రామానికి చెందిన ఎల్ములభావ్‌రావ్‌కి పట్టాచేశారు. దీనిపై తహసీల్దార్‌కు, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసినా కనీసం పట్టించుకోవడం లేదని వాపోయాడు. అధికారులు పట్టించుకోక పోవడంతో భావ్‌రావ్ దౌర్జన్యంగా తనభూమిలో సాగు చేసుకుంటున్నాడని ఆవేదన వ్యక్తంచేశాడు. భూమి తనదేనని కుటుంబ సభ్యులపై ప్రమాణం చేస్తూ తనకు న్యాయం జరగకపోతే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంటామని ఆందోళన చేశారు. స్పందించిన తహసీల్దార్ పుష్పలత వివరాలు చూసి న్యాయం చేస్తామనిచెప్పారు. అయినా వినక పోవడంతో విషయంతెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికిచేరుకుని పత్రుతోపాటు కుటుంబ సభ్యులను సముదాయించి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

జిల్లా సార్ మేడిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయులు

తిర్యాణి, సెప్టెంబరు 23: ఉపాధ్యాయులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, జిల్లా సార్‌మేడి కుర్సింగే మోతీ రాంపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఉద్యోగ, ఉపాధ్యాయులు తిర్యాణి పోలీసుస్టేషన్‌లో ఎస్సై మాధవ్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల18న ఎస్పీ ఆదివాసు లతో నిర్వహించిన సమీక్షాసమా వేశంలో ఉపాధ్యాయులు ఎవరూ పాఠశాల లకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించడం లేదంటూ మోతీరాం ఉపాధ్యాయులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అతడు ఉపాధ్యాయుడిగా ఉన్న సమయంలో ఎప్పుడైనా పాఠశాలకు వెళ్లాడా అన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలోఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రవీణ్,జనార్దన్, గోపాలకృష్ణ, యశ్వంత్‌రావు, యాదవ్‌రావు, భగవంతరావు, రత్నమాల, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూపీఎస్ స్కూల్ గ్రాంట్లపై డీడీకి ఫిర్యాదు

బెజ్జూరు, సెప్టెంబరు 23: మండలంలోని సోమిని, నలుగుపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని గిరిజన ప్రాథమిక పాఠశాల స్కూల్ గ్రాంట్లపై గిరిజనసంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవికి ప్రధానోపాధ్యాయుడు భిక్షమయ్య సోమవారం ఫిర్యాదు చేశారు. 2023-24 సంవత్సరంలో గిరిజన పాఠశాలలో స్కూల్ గ్రాంట్లు వచ్చినప్పటికీ నామమాత్రంగా వస్తువులు కొనుగోలుచేసి కొన్ని పాఠశాలల నిధులు కాజేశారని, మరికొన్ని పాఠశాలలు నిధులు ఉన్నప్పటికీ వినియోగించడం లేదని ఫిర్యాదు చేశారు. వెంటనేవిచారణజరిపి బాధ్యులపైచర్యలు తీసుకోవాలని కోరారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

దహెగాం, సెప్టెంబరు 23: మండలకేంద్రంలో సోమవారం జగిత్యాల పీజేటీఎస్ఏయూ విద్యార్థులు రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా ఆరోగ్యక మైన పంటలు పండించుకోవచ్చన్నారు. అదేవిధంగా పర్యావరణాన్ని కూడా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉదయ్, వినోద్, నరేష్ రైతులు పాల్గొన్నారు.

రేపు కుల గణన మార్చ్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 23: ఈనెల25న హైదరాబాద్‌లోని సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు నిర్వహించే కులగణనమార్చ్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమసంఘం జిల్లాఅధ్యక్షుడు రమేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైకోర్టు తీర్పును గౌరవించి సమగ్ర కులగణన చేపట్టడానికి ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించి కులగణన మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు.ఆయనవెంటనాయకులు బాలేష్, జక్కన్న ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 23: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సేవాపక్వాడలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్‌యాదవ్, మాజీఎంపీపీ వేణుగోపాల్, దేవ భూషణం, ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

వాంకిడి, సెప్టెంబరు 23: ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని ఏవో గోపీకాంత్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎమ్మార్పీకు మాత్రమే రైతులకు ఎరువులను విక్రయించాలని, రశీదులు అందించాలని, అధికధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలి

వాంకిడి, సెప్టెంబరు 23: గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని హెచ్ఈవో రవిదాస్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం విషయంలో అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి జ్వరాలతో ఉన్న నలుగురి నుంచి రక్తనమునాలు సేకరించారు. కార్యక్రమంలో కార్యదర్శి సోనం, అంగన్‌వాడీ టీచర్‌లు రాజకుమారి, వీణ తదితరులు పాల్గొన్నారు.

యువజన క్రీడాపోటీలకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 23: జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో భాగంగా ఈనెల 28నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాల సందర్భంగా జిల్లాస్థాయి సాంస్కృతిక ఉత్సవాలకింద అనేక అంశాలలో నిర్వహించనున్న పోటీలకు దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా యువజన క్రీడాశాఖ అధి కారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యం- సమూహం, జానపద నృత్యం-వ్యక్తిగతం, జాపనదపాట -సముహం, జానపద పాట-వ్యక్తిగతం, లైఫ్‌స్కిల్స్, కాంపో నెంట్- కథారచన, పోస్టర్‌మేకింగ్, సైన్స్‌ఫెయిర్ మేళా, ఫొటోగ్రఫీ, తదితర అంశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 94400010453 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



తరగతి గదుల్లోకి సెల్‌ఫోన్ నిషేధం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- కొన్ని పాఠశాలల్లో నామమాత్రంగానే అమలు
- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు

వాంకిడి, సెప్టెంబరు 23: ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదుల్లోకి ఉపాధ్యాయులు వ్యక్తిగత సెల్‌ఫోన్ తీసుకెళ్లరాదనే నిబంధన అమల్లో ఉంది. తరగతి గదిలోకి వెళ్లే ముందు సెల్‌ఫోన్లను ప్రధానోపాధ్యాయులకు అప్పగించాలని విద్యాశాఖ గతంలోనే ఉత్తర్వులు జారీచేసింది. అయినా పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించే సమయంలోనూ వినియోగిస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా విద్యాశాఖ మరోసారి తరగతి గదుల్లో సెల్‌ఫోన్‌ల వినియోగాన్ని నిషేధిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. తప్పనిసరిగా అమలుచేయాలని పేర్కొంది. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ప్రధానోపాధ్యాయుల అనుమతితో..

తాజాగా విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులు తరగతిగదిలోకి వెళ్లే ముందు సెల్‌ఫోన్‌ని ప్రధానోపాధ్యాయుడి వద్ద భద్రపర్చాలి. ఏదేని అత్యవసరం ఉంటే ప్రధానోపాధ్యాయుడి అనుమతితో మాట్లాడుకునే వీలుంటుంది. తరగతిగదిలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వినియోగించినట్లు నిర్ధారణ అయితే ఆయనతోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సైతం బాధ్యత వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యాశాఖ ఏటా విద్యాసంవత్సరం ఆరంభంలో తరగతి గదుల్లో సెల్‌ఫోన్ వినియోగాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేస్తోంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లో బోధించే మెజారిటీ ఉపాధ్యాయులు ఈ నియమాలను క్రమం తప్పకుండా పాటిస్తున్నారు. కొంతమంది మాత్రం నిబంధనలకు తిలోదకాలిస్తూ తరగతి గదుల్లో యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. సెల్‌ఫోన్ వినియోగంపై పాఠశాలలోని ఉపాధ్యాయుల మధ్య

ఆదేశాల ఉల్లంఘన..

వివాదాలు తలెత్తిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఉన్నతాధికారులు హెచ్చరించినా కొందరు ఉపాధ్యాయులు తమపనితీరు మార్చుకోకపోవడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సెల్‌ఫోన్ వినియోగంపై ఉన్నతాధికారులు సైతం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ఉపాధ్యాయులు వినియోగాన్ని మరింతగా పెంచుతున్నారు. కొందరైతే తరగతి గదుల్లోనే సామాజిక మాధ్యమాలను వాడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

విద్యార్థులకు నష్టం..

తరగతిగదిలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ ఉపయోగించడం వల్ల పాఠశాల సమయం వృథా అవుతోంది. విద్యాబోధనకు ఆటంకం కలగడమే కాకుండా విలువైన సమయాన్ని విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోంది. బోధన విషయంపై ఏకాగ్రత కోల్పోతున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులను అనుకరిస్తూ ఇంటివద్ద సెల్‌ఫోన్లను ఉపయోగిస్తున్నారు. పూర్తి స్థాయిలో చదువును పక్కనబెట్టి గంటల తరబడి సెల్‌ఫోన్లకే పరిమితమవుతున్నారు.

తద్వారా క్రమశిక్షణ దూరమై, క్రమేపిచదువుల్లో వెనుకబడి పోతున్నారు. మరోవైపు కొందరు ఉపాధ్యాయులు తమ సొంత వ్యాపారాల కోసం పాఠశాల సమయాన్ని వృథా చేస్తున్నారనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం..

మనుకుమార్, ఎంఈవో



పాఠశాల సమయంలో చరవాణులను వినియోగించకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇది వరకే అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. ఎప్పటికప్పుడు పాఠశాలలను సందర్శిస్తూ ఉపాధ్యాయుల సమావేశాల్లో సైతం సెల్‌ఫోన్‌ని పాఠశాల సమయంలో, అవసరం లేని విషయాల్లో వినియోగించకుండా చర్యలు తీసు కుంటున్నాం. పాఠశాలల్లో సెల్‌ఫోన్ వినియోగిస్తున్నట్లు మా దృష్టికి వస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

పాఠశాలల పనివేళలు ఒకేరకంగా ఉండాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ సభ్యులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 23: విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని పాఠశాలల పనివేళలు ఒకేరకంగా ఉండాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి అన్నారు. సోమవారం ఆ శాఖ ఆధ్వర్యంలో సంఘసభ్యులు ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని యాజమాన్యాల గురుకుల పాఠశాలల్లో అన్ని పాఠశాలల పనివేళలు ఒకే రకంగా ఉండాలన్నారు. మెస్ చార్జీలు పెరిగిన రేట్లకు అనుగుణంగా పెంచాలన్నారు. అలాగే జీవో 317 ద్వారా ఇతర జోన్స్ అలర్ట్ అయిన వారికి స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారిసొంత జోన్లకు పంపించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ మండల నాయకులు పార్వతి, సంతోష్, పాల్, సురేందర్, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్: గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లాకార్యదర్శి ఇందురావుమాట్లాడుతూ విద్యాహక్కు చట్టంప్రకారం అన్నిపాఠశాలల పనివేళలు ఒకేరకంగా ఉండాలని, మెస్ చార్జీలు పెరిగినరేట్లకు అనుగుణంగా తక్షణమే పెంపు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమంత్, రమేష్, తిరుపతి, గణేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కృషి: కలెక్టర్



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 23: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రత్యేకచర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సిర్పూర్(టి) మండలం లోనవెల్లికి చెందిన సిందుబాయి తనకు వితంతు పెన్షన్ ఇప్పించాలని దరఖాస్తు అందజేసింది. దహెగాం మండలకేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆనంద్‌కుమార్ తనకు రావాల్సిన జీపీఎఫ్, ఈఎల్ సంబంధిత బిల్లులు ఇప్పించాలని, ఆసిఫాబాద్ పట్టణంలోని హడ్కో కాలనీకి చెందిన వైద్య సంతోష్‌కుమార్ మున్సిపల్ కార్యాలయం నుంచి తానుకోరిన సమాచారం ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. వాంకిడి మండల కేంద్రానికి చెందిన దుర్గం శ్యాంరావు తనకు రైతు రుణమాఫీ వర్తింజేయాలని, రెబ్బెన మండలం ఎడవెల్లి గ్రామస్థులు తమ గ్రామాన్ని ఖైరిగాం జీపీ నుంచి వేరుచేసి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని దరఖాస్తు అందజేశారు. కెరమెరి మండలం పరందోళి, ముక్దంగూడ గ్రామస్థులు తమ గ్రామాల్లో తరుచుగా విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సమస్య పరిష్కరించాలని అర్జీ సమర్పించారు. కెరమెరి మండలం గోయగాం గ్రామానికి చెందిన దత్తు తన తండ్రికి రుణమాఫీ డబ్బులు వచ్చినందున బ్యాంకునుంచి ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన అహ్మద్ మున్సిపాలిటీలో ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, కౌటాల మండలం గుడ్లబోరికి చెందిన రాందాస్ సర్పంచ్‌గా 14నెలలపాటు పని చేసినందున సంబంధిత జీతం ఇప్పించాలని, కెరమెరిమండలం ముక్దంగూడకు చెందిన జ్యోత్స్న ఆశావర్కర్‌గా అవకాశం కల్పించాలని దరఖాస్తు అందజేశారు.

అర్జీలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎండీ ఖయ్యూం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 23: కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధగ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల సమస్యను పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ సమస్యలు కూడా త్వరగా పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం గ్రీవెన్స్‌డేకార్యక్రమాన్ని నిర్వహించగా, సిర్పూరు, బెజ్జూరు, కౌటాల, కాగజ్‌నగర్ మండలాలకు చెందిన పలువురు వివిధ సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. కాగజ్‌నగర్ చైతన్య వికలాంగుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖయ్యూం వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. మాజీకౌన్సిలర్ షబ్బీర్‌హుస్సేన్ కూడా పట్టణంలో మున్సిపల్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఫిర్యాదు చేశారు. మొత్తం 66మంది సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తులను సబ్‌కలెక్టర్‌కు అందజేశారు. ఇందులో భూసమస్యలు27,పెన్షన్‌లు9,రేషన్ కార్డులు 3, ఇతర శాఖలవి 27దరఖాస్తులు వచ్చినట్టు సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా తెలిపారు.

ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకుల నిరసన



లేబర్ కోడ్ పత్రాలను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 23: కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేకవిధానాలను నిరసిస్తూ సోమవారం జిల్లాకేంద్రంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంబేద్కర్‌చౌక్‌లో నిరసనచేపట్టగా, సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీనిర్వహించి లేబర్‌కోడ్‌పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులుదివాకర్,చిరంజీవి,శ్రీనివాస్, మధుసూదన్, బాలు, శ్రీనివాస్, రాజేందర్, కృష్ణమాచారి,రాజు, బాబురావుపాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో లేబర్‌కోడ్‌ప్రతులను దహనం చేశారు. అనంతరం బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగేఉపేందర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మికవర్గాన్ని కేంద్రప్రభుత్వం కట్టుబానిసలుగా తయారు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కార్మికులు నారాయణ, అలి, గురుప్రసాద్, అజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సహాయకులకు శిక్షణ

వాంకిడి/కెరమెరి, సెప్టెంబరు 23: మండలకేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని మిషన్‌భగీరథ మంచినీటి సహాయకులకు సోమవారం డీఈ ఇర్ఫాన్, ఎంపీడీవో అంజద్‌పాషా శిక్షణ తరగతులు నిర్వహించారు. నీటి నాణ్యత, చేతిపంపుల మరమ్మతులు, పైపులైన్ మర మ్మతులు, మోటార్ల రిపేర్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో అజీజుద్దీన్, కెరమెరిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాకేష్, ఏఈ విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలి'

జైపూర్, సెప్టెంబరు 23: సింగరేణియాజమాన్యం కాంట్రాక్టుకార్మికులకు లాభాలవాటా ప్రకటించినట్లుగానే ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల వాటా ఇవ్వాలని సోమవారం ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావుకు హెచ్‌ఎంఎస్ నాయకులు చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణ రెడ్డి వినతిపత్రం అందించారు. డైరెక్టర్ పా దృష్టికి తీసుకువెళ్లి పవర్ ప్రాజెక్టును కూడా చేర్చేలా చర్యలు తీసుకుంటామని ఈడీ హామీఇచ్చారని తెలిపారు. లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగే చర్చల్లో సింగరేణి యాజమాన్యం భూనిర్వాసిత కార్మికులను పర్మినెంటు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల అలవెన్స్ అందజేసే విధంగా అగ్రిమెంటు చేసేలా డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు ఏరియర్స్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23: ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు 11రోజుల ఏరియర్స్ లభించేలా తమ యూనియన్ కృషిచేసిందని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) బ్రాంచ్ గట్టు మహేందర్ తెలిపారు. సోమవారం శ్రీరాంపూర్‌లో ఆయన మాట్లాడారు. 2021లో కాంట్రాక్టర్ మారాడనే సాకుతో 11 రోజుల వేతనాన్ని గార్డులకు చెల్లించలేదన్నారు. ఈ విషయంపై తాము మంచిర్యాల సహాయ కార్మికశాఖ కమిషనర్(సెంట్రల్) వద్ద కేసు వేసి విజయం సాధించినట్లు చెప్పారు. ఫలితంగా 11 రోజుల ఏరియర్స్ గార్డుల ఖాతాలకు జమ అయ్యాయని తెలిపారు. కేసు విషయంలో సహకరించిన సింగరేణి అధికారులు, సీఐటీయూ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లాభాలను పక్కదారి పట్టిస్తున్న యాజమాన్యం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23: కార్మికులు ఎంతో శ్రమకోర్చి సాధించుకున్న లాభాలను సింగరేణి యాజమాన్యం పక్కదారి పట్టిస్తోందని సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు ఒక ప్రకటనలో ఆరోపించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నికర లాభం 4701 కోట్ల రూపాయలు కాగా, దానిలోంచి 2289 కోట్ల రూపాయలు పక్కనబెట్టి, మిగతా డబ్బుపై 33 శాతం లాభాల వాటా ప్రకటించడం కార్మికులను మోసగించడమేనని పేర్కొన్నారు. నికర లాభాన్ని స్థూల లాభంగా చెప్పడం ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ యూనియన్లు చేస్తున్న తప్పుడు ప్రచారమని తెలిపారు.



కైరిగూడ ఓసీని సందర్శించిన జీఎం



కైరిగూడ ఓసీని సందర్శిస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన, సెప్టెంబరు 23: కైరిగూడ ఓసీని సోమవారం బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా 2024-25ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను గని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఎస్‌వోటు జీఎం రాజమల్లు, కైరిగూడ పీవో మచ్చగిరి నరేందర్, మేనేజర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులను మోసగించిన ప్రభుత్వం'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23: లాభాలవాటా విషయంలో కాంగ్రెస్‌ప్రభుత్వం కార్మికులను మోసగించిందని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. లాభాలవాటా తక్కువగా ప్రకటించినందుకు నిరసనగా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం గనులు, విభాగాలపై నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థకు 4701 కోట్ల రూపాయల లాభం వచ్చిందన్నారు. దీనికి 33శాతం వాటా లెక్కగడితే 1551.33 కోట్ల రూపాయలు కార్మికులకు అందించాల్సి ఉందన్నారు. కానీ ప్రభుత్వం796(16.9 శాతం) కోట్ల రూపాయలు ఇవ్వనున్నట్లు ప్రకటించిందన్నారు. పైగా దీనినే 33శాతం లాభాల వాటా ప్రకటించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, నాయకులు రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: కార్మికులకు 4700కోట్లపై 33శాతం లాభాలవాటా చెల్లించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం ఏరియాలోని కేకే5గనిపై టీబీజీకేఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్ర మంలో నాయకులు తోట శ్రీనివాస్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు. కాగా ఏరియాలోని వర్కుషాపు, స్టోర్స్, కేకే ఓసీలలో కూడా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

పరిశుభ్రతలో సింగరేణిని ఆదర్శంగా నిలపాలి: జీఎం



స్వచ్ఛత కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం

మందమర్రి టౌన్, సెప్టెంబరు 23: పరిశుభ్రతలో సింగరేణి ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలిచేలా కార్మికులు, అధికారులు కలిసికట్టుగా ముందుకుసాగాలని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. సోమవారం సింగరేణి అంబేద్కర్ గ్రీన్‌పార్కులో 4.0స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల16 నుంచి 30వరకు 4.0సన్నాహక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతీరోజు మననివాసప్రాంతాలను ఎలాపరిశుభ్రంగా ఉంచుకుంటామో గని పనిప్రదేశాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం గ్రీన్‌పార్కులో అధికారులతో కలిసి వంద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, ఫారెస్టు అధికారి రమణరెడ్డి, ప్రభాకర్, బ్రాంచి సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

భావితరాల కోసమే పచ్చదనం

రెబ్బెన, సెప్టెంబరు 23: భావితరాల కోసం పచ్చదన కార్యక్రమం ఉపయోగపడుతుందని సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైరిగూడలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రామన్ని నిర్వహించి మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్ తిరుపతి, ఎస్‌వోటు జీఎం కె.రాజమల్లు, కైరిగూడ పీవోనరేందర్‌పాల్గొన్నారు.

'పర్యారణపరిరక్షణకు మొక్కలు నాటాలి'

జైపూర్, సెప్టెంబరు 23: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలునాటాలని ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, కార్పొరేట్ ప్లానింగ్‌అండ్‌ప్రాజెక్టు జీఎం రమేష్ పేర్కొన్నారు. స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం ఎస్టీపీపీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణంలేకుంటే మానవమనుగడ సాధ్యంకాదన్నారు. ఎస్టీపీపీలో ప్రతియేటా మొక్కలు నాటిపర్యావరణాన్ని కాపాడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు శ్రీనివాసులు, జేఎన్‌సింగ్, సముద్రాల శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'కోల్ ఇండియాలో పతకాలు సాధించాలి'

మందమర్రిటౌన్, సెప్టెంబరు 23:సింగరేణి క్రీడాకారులు కోల్‌ఇండియాలో పతకాలు సాధించాలని మందమర్రి కేకే1డిస్పెన్సరీ డాక్టర్ రాజేశ్వర్‌రావు తెలిపారు. సోమవారం సింగరేణి పాఠశాలలో నిర్వహించిన కార్మికుల బాస్కెట్‌బాల్‌పోటీలకు ఆయనముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలకు యాజమాన్యం పెద్దపీట వేస్తుందన్నారు. కాగా ఈపోటీల్లో కాసిపేట గ్రూపు విన్నర్‌గా కేకే గ్రూపు రన్నర్‌గా నిలిచాయి.

'కార్మికులకు మెరుగైన లాభాల వాటా ఇప్పించాం'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23: సింగరేణి కార్మికులకు మెరుగైన లాభాలవాటా ఇప్పించామని ఐఎన్‌టీ యూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. ఎస్‌ఆర్‌పీ 1గనిలో సోమవారం బాయిబాట నిర్వహించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. కార్మికులకు 33శాతం వాటాతోపాటు కాంట్రాక్టు కార్మికులకు సైతం 5వేల రూపాయలు లాభాలవాటా ఇప్పించామని గుర్తుచేశారు. చౌకబారు ఆరోపణలు మానుకోకపోతే తగినమూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీ యూసీ జాతీయసమితి సభ్యుడు సీహెచ్ భీమ్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, ఉపప్రధానకార్యదర్శి గరిగెస్వామిపాల్గొన్నారు.

మందమర్రి టౌన్: లాభాల విషయంలో ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు, ఐఎన్టీయూసీ కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, జిల్లాఅధ్యక్షుడు రాంశెట్టి నరేందర్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏమేరకు లాభాలు చెల్లించిందో అందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు, అనుబంధసంఘాలనాయకులు పాల్గొన్నారు.

నేడు శ్రీరాంపూర్‌లో ఉత్తర తెలంగాణ అభివృద్ధిపై సదస్సు

మందమర్రి టౌన్, సెప్టెంబరు 23: కోల్‌బెల్ట్‌ప్రాంతమైన శ్రీరాంపూర్‌లో మంగళవారం ఉత్తరతెలంగాణ అభివృద్ధిపైసదస్సు నిర్వహిస్తున్నారు. పలువురు జర్నలిస్టులు స్వచ్ఛందసంఘాల ఆధ్వర్యంలో ఈసదస్సును శ్రీరాంపూర్‌ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుల్లో వెనుకబాటుపై చర్చించనున్నారు. అభివృద్ధికి సంబంధించి పలు నిర్ణయాలు తీసుకోనున్నారు. ప్రధానంగా రాష్ట్రానికి, కేంద్రానికి సింగరేణి పన్నులు చెల్లిస్తున్నాయని, ఈ ప్రాంతం అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వాలకు నివేదిక కూడా సదస్సు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

కారుణ్య నియామకాలతో యువతకు ఉపాధి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23: కారుణ్యనియామకాలతో యువతకు ఉపాధి లభిస్తుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. కారుణ్య విధానంలో ఉద్యోగాలుపొందిన 34మందికి సోమవారం ఆయన నియామకపత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ, విధులకుసక్రమంగా హాజరవుతూ, క్రమశిక్షణతో సింగరేణి అభివృద్ధిలో పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఏఐటీయూసీబ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా పాల్గొన్నారు.

'యూనియన్లవి దివాళాకోరు రాజకీయాలు'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23: కార్మికుల లాభాల వాటా విషయంలో ఇతర యూనియన్లు దివాళాకోరు రాజకీయాలు చేస్తున్నాయని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి ముష్కె సమ్మయ్య అన్నారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గుర్తింపు సంఘంగా తాము యాజమాన్యంతో మాట్లాడి 796(33శాతం) కోట్ల రూపాయలు లాభాల వాటా ఇప్పించేందుకు ఒప్పించామన్నారు. లాభాల వాటా అంశాన్ని టీబీజీకేఎస్ తన రాజకీయ మైలేజీ కోసం వాడుకోవాలిన చూస్తోందని ఆరోపించారు. కార్మికులు లోతుగా ఆలోచించి ఏఐటీయూసీ వెంట నడవాలని కోరారు. సమావేశంలో ఏరియా కార్యదర్శి ఎం ప్రసాదరెడ్డి, ఆర్‌కే5 పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి చల్ల తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

మహిళల విశ్రాంతి గది ప్రారంభం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 23: శ్రీరాంపూర్ ఓసీపీలో మహిళల కోసం నూతనంగా నిర్మించిన విశ్రాంతిగదిని ప్రాజెక్ట్ అధికారి టి శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. స్వచ్ఛతా పక్వాడాలో భాగంగా ఓసీపీ ప్రాంగణంలోని మామిడి తోటలో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాలలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, గని మేనేజర్ బ్రహ్మాజీరావు, ఇన్‌చార్జి ఎస్‌వో సంపత్, తదితరులు పాల్గొన్నారు.